తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ సోమవారం 26 - 10 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 3

## కష్టకాలంలో ప్రజలకు భరోసా ఇచ్చేవాడే నాయకుడు..

# భయపెట్టేవాడు నాయకుడు కాదు



### కరువొస్తే ఆదుకోవడానికి కేసీఆర్ కట్టిందే కాళేశ్వరం

### మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి

- గోదావరి, కృష్ణా జలాలు ఎత్తిపోయడంలో మొద్దునిద్ర పోయిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం
- తెలంగాణను ఎండబెట్టి ఆంధ్రకు నీళ్లు వదిలిన రేవంత్‌రెడ్డి
- ఇక్కడ పంటలు వేయొద్దని రేవంత్‌రెడ్డి చెప్తుంటే..ఏపీలో చంద్రబాబు ఎందుకు చెప్పడం లేదు
- ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువే

**ప్రజావారధి/మోత్కూరు**

కష్టకాలంలో ప్రజలకు ఏ ఆపద వచ్చినా వారికి అండగా ఉండి భరోసా ఇచ్చేవాడే నాయకుడని, ప్రజలను భయపెట్టి ఆందోళనకు గురిచేసే వాడు నాయకుడే కాదని మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంపై గత కొంత కాలంగా ప్రపంచమంతా కోడై కూస్తున్నా సీఎం రేవంత్ రెడ్డి ముందస్తు చర్యలు తీసుకోకుండా పుణ్యకాలం కాస్తా చేజారిన తర్వాత ఇప్పుడు జాగ్రత్తగా ఉండకపోతే చస్తారంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజల కోసం కాకుండా ఆంధ్ర కోసం పని చేస్తున్నట్టుగా కనిపిస్తోందన్నారు. కరువొస్తే ఆదుకోవడానికి కేసీఆర్ కట్టిన కాళేశ్వరం నీళ్లను, శ్రీశైలం నీళ్లను వాడుకోవడం చేతగాక చంద్రబాబుకు వదిలిపెట్టి తెలంగాణ ప్రాంతాన్ని ఎండబెట్టిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. తెలంగాణను దాటుకుని గోదావరి, కృష్ణా జలాలు ఆంధ్రాలోకి వందల కిలోమీటర్లు ఎలా ప్రవహిస్తున్నాయని ప్రశ్నించారు. ప్రెస్‌మీట్లు పెట్టి నీళ్లు లేవు పంటలు వేయవద్దు.. తాగునీటికి కూడా కష్టమే అని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని, అదే ఏపీలో చంద్రబాబు ఎందుకు చెప్పడం లేదన్నారు. మడు, నాలుగు నెలలుగా వందల టీఎంసీల నీళ్లను ఎత్తిపోసే అవకాశం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోయిందని, రైతులు, ప్రజల పట్ల ఏమాత్రం ప్రేమ లేదన్నారు. తెలంగాణలో నీళ్లు లేక పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు కారుస్తుంటే ఆంధ్రాలో సాగునీరు పారుతుంటే రైతాంగం ఆనందంగా ఉందన్నారు. కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలను వాడుకుంటే తెలంగాణకు కరువు రాకుండా ఉండేదని, ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరువేనన్నారు. నీళ్లు, కరెంట్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మడేళ్లవుతుందని, మడేళ్లుగా బీఆరఎస్ నాయకులను తిట్టడం, నిందలు వేయడం తప్పా చేసిందేమీ లేదన్నారు. రైతులు, ప్రజలు ఓట్లేసి గెలిపించింది నీళ్లు రావు..కరెంట్ రాదు..పంటలు వేయకండి అని దద్దమ్మ మాటలు మాట్లాడటానికి కాదని, ప్రభుత్వం అంటే రైతులకు, ప్రజలకు భరోసా, ధైర్యాన్ని ఇవ్వాలని, సీఎం రేవంత్‌రెడ్డికి పాలన చేతకాకుంటే రాజీనామా చేయాలన్నారు.

# ప్రాచీన కళలను కాపాడుకుందాం

## పల్లె కవులు, కళాకారుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర యాదగిరి





**ప్రజావారధి/శాలిగౌరారం**

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన ప్రాచీన కళలను కాపాడుకుని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పల్లె కవులు, కళాకారుల ఐక్యవేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఎర్ర యాదగిరి అన్నారు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలో అంతరించి పోతున్న యక్షగాన కళకు పునర్వైభవం తీసుకురావాలనే ఉద్దేశంతో గత రెండు రోజులుగా "సీతారామ వనవాసం - శ్రీరామ పట్టాభిషేకం" యక్షగాన ప్రదర్శన అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎర్ర యాదగిరి జ్యోతి ప్రజ్వలన చేసి యక్షగానాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమాలు, టీవీల ప్రభావంతో యక్షగానం, బుర్రకథ, ఒగ్గుకథ వంటి ప్రాచీన కళలు కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించడం ద్వారానే కళాకారులకు జీవనోపాధి, కళలకు గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఆకారం గ్రామస్తులు యక్షగానం కోసం చూపిన చొరవ అభినందనీయమని, ప్రతి గ్రామంలో ఇలాంటి కళలను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వలిశెట్టి చంద్రకళదశరథ, ఉప సర్పంచ్ అయితగోని లక్ష్మయ్య, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.




## మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన నిరుపేద డబ్బు కళాకారుడు కూరెళ్ల భిక్షం ఇటీవల మృతి చెందగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. భిక్షం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు రాచకొండ బాలరాజు, బద్దం నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి కూరెళ్ల శ్రీరాములు, నాయకులు డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, చింతల విజయభాస్కర్‌రెడ్డి, అన్నెపు పద్మ, మందుల సురేష్, బందెల రవి, కూరెళ్ల పక్కీరు, కూరెళ్ల యాదయ్య, మెంట నర్సింహ పాల్గొన్నారు.

## రాజకీయ వివక్ష లేకుండా..

# అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

## సీపీఎం మండల కార్యదర్శి వెంకటనర్సు




ప్రజావారధి/మోత్కూరు
ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో రాజకీయ వివక్షతకు తావులేకుండా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక కోసం ఏర్పాటు చేసే ఇందిరమ్మ కమిటీలను ప్రభుత్వం పార్టీలకతీతంగా ఏర్పాటు చేస్తామని చెప్పి కమిటీలను పూర్తిగా కాంగ్రెస్ కార్యకర్తలతో ఏర్పాటు చేశారని, దీంతో రాజకీయ వివక్షతతో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం లేదని ఆరోపించారు. ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి గ్రామసభల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన జాబితా ఆధారంగానే అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని, కాంగ్రెస్ కండువా కప్పుకుంటేనే జాబితాలో పేర్లు ఉంటాయని చెప్పడం అప్రజాస్వామికమన్నారు. ఫేజ్ 1, 2, 3 జాబితాల పేరుతో అనర్హులనే ఎంపిక చేస్తున్నారని, గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాలను అమలు చేస్తుందని విమర్శించారు. ఇందిరమ్మ కమిటీలను రద్దు చేసి గ్రామసభల ద్వారానే అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు దడిపెల్లి ప్రభాకర్, పానుగుల రమేష్ ఆయన వెంట ఉన్నారు.

# పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజావారధి/మోత్కూరు
ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పట్టభద్రులంతా ఓటు నమోదు చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాచకొండ బాలరాజు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల కోసం నవంబర్ 6వ ఓటరు నమోదుకు చివరి తేది అని, పట్టభద్రులంతా విధిగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో మోత్కూరులో హీరో షోరూం ఎదురుగా పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఉచితంగా ఓటు నమోదు కోసం ఆన్‌లైన్ దరఖాస్తు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



ఇప్పటి వరకు 100 మందికి ఉచితంగా ఓటు నమోదు చశామని, పట్టభద్రులు ఓటు నమోదు కోసం డిగ్రీ మెమో లేదా ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, పాస్ ఫోటో తీసుకుని వస్తే దరఖాస్తు చేస్తామని తెలిపారు. అర్హులైన వారంతా ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నామని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందన్నారు.